# సాక్షి
## తూర్పుగోదావరి

శనివారం । 4 । మార్చి । 2023






**కమనీయం.. నరసన్న కల్యాణం**


కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం కమనీయంగా సాగింది. రాత్రి 9 గంటలకు వైఖానస ఆగమం ప్రకారం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. - IIలో▸



**మండుటెండలో పరుగుల పరీక్ష**

ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా రన్నింగ్‌లో పాల్గొన్న 10వ తరగతి విద్యార్థినులు ఎండధాటికి తాళలేక సొమ్మసిల్లి పడిపోయి. తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. - IIలో▸

**డెల్టాలకు 7,540 క్యూసెక్కులు**



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 7,540 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,170, మధ్య డెల్టాకు 1,600, పశ్చిమ డెల్టాకు 3,770 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.05 అడుగులకు చేరింది.

## న్యూస్‌రీల్

### స్కానింగ్ సెంటర్లపై నిరంతర నిఘా



స్ట్రీట్ వాక్ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, అధికారులు, వైద్యులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్కానింగ్ సెంటర్లపై నిరంతర నిఘా ఉంటుందని, చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. బేటీ బచావో – బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా అధికారులు, సిబ్బంది శుక్రవారం దానవాయిపేటలో స్ట్రీట్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లనూ తనిఖీ చేసేందుకు వైద్యాధికారులతో 22 బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి స్కానింగ్ సెంటర్‌నూ తనిఖీ చేసి, అనుమతులు లేని వాటిని వెంటనే సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం, స్కానింగ్ సెంటర్ల పర్యవేక్షణ, డెకాయ్ ఆపరేషన్లు, పాఠశాలలో ఆరోగ్య విద్య వంటి కార్యక్రమాలు ఈ నెల 8వ తేదీ వరకూ జరుగుతాయని వివరించారు. చివరి రోజు చేపట్టిన ప్రతి అంశాన్నీ ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేస్తామని తెలిపారు. అదే రోజు ఐసీడీఎస్, హెల్త్ డిపార్ట్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.వసుందర, డీఎల్ఏటీవో డాక్టర్ సుధాకర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రసన్న, డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కాకినాడ వెళ్లి.. పింఛన్ అందజేసి..



కాకినాడలో క్యాస్టెల్లా నైస్‌కు పింఛను అందజేస్తున్న వలంటీర్ నిర్మలకుమారి

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక బొమ్మూరుకు చెందిన మహిళ క్యాస్టెల్లా నైస్ వెన్నెముక శస్త్రచికిత్స చేయించుకుని కాకినాడలో విశ్రాంతి తీసుకుంటోంది. ఆమెకు బొమ్మూరు గ్రామ సచివాలయం-1 వలంటీర్ నిర్మలకుమారి గురువారం కాకినాడ వెళ్లి ఒంటరి మహిళ పింఛను అందజేసింది. నిర్మలకుమారిని పలువురు అభినందించారు.

### బాధ్యతల స్వీకరణ



సీటీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రమౌళి

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాన రైల్వే స్టేషన్ చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్‌గా సుంకర చంద్రమౌళి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందిస్తానని చెప్పారు. చంద్రమౌళిని సహోద్యోగులు, ఆటో, ట్యాక్సీ యూనియన్ల నాయకులు అభినందించారు.

### డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో రెండు నెలల శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్(న్యాక్)లోని స్కిల్ హబ్‌లో ఈ శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు చూపిస్తామని చెప్పారు. ఇంటర్, ఆపైన చదివిన 19 – 30 సంవత్సరాల వయస్సు కలిగిన వారు శిక్షణకు అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన స్థానిక నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మార్కుల జాబితా, ఆధార్ కాపీలతో న్యాక్‌లోని స్కిల్ హబ్ సెంటర్‌కు నేరుగా రావాలని సూచించారు. అభ్యర్థులు తమ వివరాలను https://tinyurl.com/skillhubsphaseII లింకు ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9133 91 2947 నంబరులో సంప్రదించాలని కొండలరావు కోరారు.

# అడ్డగోలు దోపిడీకి బ్రేక్

- కోవిడ్ ఖర్చుల్లో 'స్వచ్ఛంద' సేవలకూ బిల్లులు
- బట్టబయలైన బాగోతం
- బెడిసికొట్టిన అక్రమార్కుల వ్యూహం
- పక్కన పెట్టిన బిల్లులు రూ.17 కోట్లు పైనే..
- తీవ్రంగా పరిగణించిన కాకినాడ కలెక్టర్
- ఇప్పటికే డీఎంహెచ్‌ఓ సరెండర్
- ఇద్దరు ఉద్యోగుల బదిలీ

**కోవిడ్ బిల్లులతో** పాత బిల్లులు కూడా కలిపేశారు. స్వచ్ఛంద సంస్థల సేవలను కూడా తమ ఖాతాల్లో వేసేసుకుని ప్రజాధనాన్ని అడ్డంగా నొక్కేద్దామనుకున్నారు. జిల్లాల పునర్విభజన జరిగినప్పటికీ కోవిడ్‌కు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్రం కాకినాడ నుంచే నిర్వహిస్తున్నారు. దీంతో అడ్డగోలు దోపిడీ యత్నాన్ని కాకినాడ జిల్లా కలెక్టర్ సకాలంలో పసిగట్టారు. ఫలితంగా అక్రమార్కుల వ్యూహం అడ్డంగా బెడిసి కొట్టింది. విషయాన్ని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ సంబంధిత అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలకు ఉపక్రమించారు.



కాకినాడ జీజీహెచ్‌లో కోవిడ్ బాధితుడి వివరాలు తెలుసుకుంటున్న నాటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ మురళీధర్‌రెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కోవిడ్ మొదటి, రెండు వేవ్‌లతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అతలాకుతలమైంది. కరోనా మహమ్మారి నుంచి ప్రజలను రక్షించుకునేందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసింది. రోగులకు అవసరమైన అన్ని రకాల సేవలనూ ఎటువంటి లోటూ లేకుండా ప్రభుత్వం అందించింది. కాకినాడ జేఎన్‌టీయూ, అమలాపురం శివారు బోడసకుర్రు టిడ్కో గృహ సముదాయాలు, రాజమహేంద్రవరం బొమ్మూరు ప్రాంతాల్లో కోవిడ్ కేర్ సెంటర్లు (సీసీసీ) ఏర్పాటు చేశారు. వీటితో పాటు కాకినాడ జీజీహెచ్, రాజమహేంద్రవరం వైద్య విధాన పరిషత్ ఆస్పత్రి, అమలాపురం, రామచంద్రపురం ప్రాంతీయ ఆస్పత్రుల్లో కూడా కోవిడ్ సేవలందించారు. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య ఉపకరణాలు, మాస్కులు, మందులు, శానిటైజర్లు, సీసీసీల్లో రోగులకు అల్పాహారం, భోజనాల వంటి వాటిని ఎక్కడికక్కడ రెవెన్యూ, వైద్య, ఆరోగ్య శాఖల ఆధ్వర్యాన క్షేత్ర స్థాయిలో ముందస్తుగా కొనుగోలు చేసి సమకూర్చారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా సీసీసీలు, ఆస్పత్రుల్లో కోవిడ్ బాధితులకు భోజనాలు, అల్పాహారం అందించి, మానవత్వం చాటుకున్నాయి.

**పారని పన్నాగం**

కరోనా మహమ్మారి తగ్గుముఖం పట్టిన తరువాత కోవిడ్ సమయంలో చేసిన ఖర్చులంటూ వైద్య, ఆరోగ్యం సహా పలు శాఖల నుంచి రూ.లక్షల్లో బిల్లులు తయారు చేశారు. వీటిలో స్వచ్ఛంద సంస్థలు సమకూర్చిన వస్తువులు, భోజనాలు, సేవలను కూడా అక్రమార్కులు తమ ఖాతాలో వేసేసుకున్నారు. వాటిని కూడా తమ ఖర్చులుగానే చూపించేందుకు బరితెగించారు. సంబంధిత బిల్లులు కూడా సిద్ధం చేశారు. ఆ విధంగా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తే ఆ డబ్బులు నొక్కేయాలని వ్యూహం పన్నారు. అయితే వారి పన్నాగం పారలేదు. 'తీగ లాగితే డొంక కదిలిన చందంగా ఈ తప్పుడు బిల్లుల బాగోతం బట్టబయలైంది. కోవిడ్‌కు ముందు వైద్య, ఆరోగ్య శాఖలో జరిపిన ఇతర లావాదేవీలను కూడా కోవిడ్ బిల్లుల్లోనే కలిపి చూపించినట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల నుంచి ఈ విధంగా వచ్చిన మొత్తం కోవిడ్ బిల్లులు రూ.17 కోట్లు పైనే ఉన్నట్టు అధికార వర్గాలు ధ్రువీకరించాయి. పెద్ద మొత్తంలో బిల్లులు, అవి కూడా పాతవి రావడంతో కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు అనుమానం వచ్చింది. దీంతో నాలుగు శాఖల ద్వారా వచ్చిన ఆ ఫైళ్లను ఆమె పక్కన పెట్టారు. ఈ ఫైళ్లను సక్రమంగా నిర్వహించలేదని ప్రాథమిక పరిశీలనలో గుర్తించారు. దీంతో వాటి నిజానిజాలు నిగ్గు తేల్చాలని నిర్ణయించారు. అయితే నాడు కోవిడ్ సమయంలో పని చేసిన అధికారులెవరూ ప్రస్తుతం జిల్లాలో లేరు. నాటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ మురళీధర్‌రెడ్డి, సీసీసీలను పర్యవేక్షించిన అదనపు జాయింట్ కలెక్టర్, అప్పటి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) తదితరులు ప్రస్తుతం వివిధ హోదాల్లో ఇతర జిల్లాల్లో, రాష్ట్ర స్థాయిలో పని చేస్తున్నారు.

### స్టేట్ ఆడిట్ బృందం విచారణ

**ఈ నేపథ్యంలో కలెక్టర్ కృతికా శుక్లా తొలుత** మొత్తం అన్ని బిల్లులనూ తిప్పి పంపేశారు. బిల్లుల నిర్వహణలో ఉద్దేశపూర్వకంగా తప్పులు చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చి, కాకినాడ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతిప్రభను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. కలెక్టరేట్ హెచ్–సెక్షన్ సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్లను బదిలీ చేశారు. వారు విచారణను ప్రభావితం చేస్తారనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. బిల్లుల్లో లొసుగులను నిగ్గు తేల్చేందుకు రాష్ట్ర స్థాయి ఆడిట్ బృందంతో విచారణ చేపట్టారు. కోవిడ్ సమయంలో పని చేసిన అధికారులెవరూ ప్రస్తుతం ఇక్కడ లేకపోవడంతో అంతా గందరగోళంగా ఉంది. ఆడిట్ అధికారులే నిజాలు నిగ్గు తేల్చాల్సి ఉంది.

### బిల్లుల నిర్వహణలో లోపాలు



బిల్లుల నిర్వహణలో అన్ని స్థాయిల్లోనూ లోపాలున్న మాట వాస్తవమే. మా పరిశీలనలో ఈ విషయం స్పష్టమైంది. ఇందుకు బాధ్యులైన వారిపై ప్రాథమిక సమాచారం మేరకు చర్యలు తీసుకున్నాం. సమగ్ర విచారణకు ఆదేశించాం. స్టేట్ ఆడిటర్ల బృందంతో బిల్లుల్లో లొసుగులను వెలికి తీయిస్తున్నాం. ఏయే శాఖల నుంచి ఏయే బిల్లులు వచ్చాయి, వాటి వాస్తవ పరిస్థితి ఏమిటనేది ఆడిటర్లు ఆరా తీస్తున్నారు. ఈ ప్రక్రియ కొలిక్కి రావడానికి వారం పది రోజులు పడుతుంది. బిల్లులు ఏ స్థాయిలోనూ అప్‌లోడ్ చేయకపోవడంతో ఒక్క పైసా కూడా పక్కతోవ పట్టలేదు.

**- కృతికా శుక్లా, కలెక్టర్, కాకినాడ జిల్లా**

### ప్రభుత్వ వైద్య సేవలపై మెడికోలకు శిక్షణ



అనపర్తి ఏరియా ఆస్పత్రిలో వైద్య విద్యార్థులతో సమావేశమైన డాక్టర్ సనత్‌కుమారి

అనపర్తి: ప్రభుత్వాస్పత్రుల ద్వారా గ్రామీణ ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వైద్య సేవలపై వైద్య విద్యార్థులకు (మెడికోలు) శిక్షణ ఇస్తున్నామని జిల్లా ప్రభుత్వాస్పత్రుల సమన్వయాధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ ఎం.సనత్‌కుమారి తెలిపారు. స్థానిక ఏరియా ఆస్పత్రికి శుక్రవారం వచ్చిన ఆమె విలేకర్లతో మాట్లాడారు. జాతీయ ఆరోగ్య మిషన్ సూచనలకు అనుగుణంగా వైద్య విద్యార్థులకు వ్యాక్సినేషన్, ఇమ్యూనైజేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా జీఎస్ఎల్ వైద్య కళాశాల నుంచి మొదటి బ్యాచ్‌కు చెందిన 12 మంది విద్యార్థులు అనపర్తి ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. మూడు నెలలకు ఒక్కో బ్యాచ్ చొప్పున 4, 5, 6 సెమిస్టర్ల విద్యార్థులు నిరంతరం వైద్య సేవలు అందిస్తారన్నారు. కొవ్వూరు ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలందించేందుకు జీఎస్ఎల్ ఆస్పత్రి వర్గాలను సంప్రదించామని సనత్‌కుమారి తెలిపారు.

### నేడు ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం మహాసభ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జీవిత బీమా ఉద్యోగుల సంఘం ఉభయ జిల్లాల 26వ వార్షిక మహాసభ స్థానిక జేఎన్ రోడ్డులోని సూర్య గార్డెన్స్‌లో శనివారం జరుగుతుంది. సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎంఏఎఫ్ బెనర్జీ, పి.సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. మహాసభను అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వి.రమేష్ ప్రారంభిస్తారని, ముఖ్య వక్తగా పూర్వపు ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌తో పాటు కోశాధికారి బీఎస్ రవి, జోనల్ ప్రధాన కార్యదర్శి టీవీఎంఎస్ రవీంద్రనాథ్ పాల్గొంటారని వివరించారు. పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల నుంచి సుమారు 600 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

## చతుర్వేద యాగంలో కంచి పీఠాధిపతి

కొవ్వూరు: కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్థానిక ఆంధ్రా గీర్వాణ విద్యా పీఠంలో (సంస్కృత కళాశాలలో) నిర్వహిస్తున్న శ్రీనివాస రుక్ సహిత చతుర్వేద యాగంలో శుక్రవారం పాల్గొన్నారు. వేంకటేశ్వర ఉన్నత వేదాధ్యయన సంస్థ, హిందూ ధార్మిక సంస్థల ఆధ్వర్యాన ఈ యాగం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తిరుమల – తిరుపతి దేవస్థానం వేద పండితులు వేద పారాయణ చేశారు. 33 మంది రుత్వికులు, 60 మంది మహాపండితులు మూడు రోజులుగా ఈ యాగం నిర్వహిస్తున్నారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు కె.సరస్వతీ ప్రసాద్ ఆధ్వర్యాన అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు ఆకెళ్ల విభీషణశర్మ, దత్తాత్రేయ ఘనపాఠి, గుళ్లపల్లి శివశర్మ అవధాని, మహామహోపాధ్యాయ దోర్బల ప్రభాకరశర్మ తదితరుల పర్యవేక్షణలో ఈ క్రతువులు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి ఈ నెల ఏడో తేదీ వరకూ కళాశాల ప్రాంగణంలో నిర్వహించే త్రికాల పూజాదికాల్లో పాల్గొంటారు. గోష్పాద క్షేత్రం ధర్మజ్ఞాన కళావేదికలో శనివారం జరిగే శంకరాచార్య ఆరాధనోత్సవంలో ఆయన పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.



చతుర్వేద యాగానికి విచ్చేసిన శంకర విజయేంద్ర సరస్వతి

## పట్టుబడిన 117 ఫోన్లు

- బాధితులకు అప్పగించిన పోలీసులు
- సత్ఫలితమిస్తున్న చాట్‌బాట్ సేవలు



పోగొట్టుకున్న ఫోన్‌ను బాధితురాలికి అందజేస్తున్న ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సెల్‌ఫోన్ల చోరీలకు సంబంధించి జిల్లా పోలీసులు ఇటీవల ప్రవేశపెట్టిన చాట్‌బాట్ సేవలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. సెల్‌ఫోన్‌లను దొంగిలిస్తున్న వ్యక్తులను జిల్లా పోలీసులు పట్టుకుని, వారి నుంచి 117 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దిశ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకూ అధికంగా ఉంటోంది. దీనికి చెక్ పెట్టేందుకు జిల్లా పోలీసులు చాట్‌బాట్ ప్రవేశపెట్టారు. ఇందులో బాధితులు తమ వివరాలు నమోదు చేస్తే వీలైనంత త్వరగా చోరీ అయిన సెల్‌ఫోన్ పట్టుకుని ఇస్తున్నారు. చాట్‌బాట్ సేవలు ప్రారంభించిన 20 రోజుల్లో జిల్లావ్యాప్తంగా 500 ఫిర్యాదులు వచ్చాయి. వీటికి సంబంధించి పోలీసులు ఇప్పటి వరకూ రూ.22,30,500 విలువైన 117 ఫోన్లను పట్టుకున్నారు. వాటిని బాధితులకు ఎస్పీ అందజేశారు. ఈ ఫోన్లను పట్టుకునేందుకు అడిషనల్ ఎస్పీ (క్రైం) జి.వెంకటేశ్వరరావు, డీఎస్పీ (క్రైం) ఎంజేవీ భాస్కరరావు, జి.గురునాథ్‌బాబు పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, మొబైల్ ట్రాకింగ్ వ్యవస్థ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించారు. మిగిలిన ఫోన్లు కూడా త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ చెప్పారు. సెల్ ట్రాకింగ్ టీమ్ ఇన్‌స్పెక్టర్ ఎం.కృపానందం, పీవీ త్రినాథ్, ఎస్సైలు బీడీఎస్ దుర్గాప్రసాద్, జె.ఆదినారాయణ, షరీఫ్, పి.శ్రీనివాసరావు, టి.రవి, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను, ఐటీ కోర్ టీమ్ ఇన్‌స్పెక్టర్ డి.రాంబాబును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



పట్టుబడిన సెల్‌ఫోన్లు

**చాట్‌బాట్ సేవలను వినియోగించుకోవాలి**

చాట్‌బాట్ సేవలను వినియోగించుకోవాలని ఇన్‌చార్జి ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి ప్రజలకు సూచించారు. ఫోన్ చోరీ అయినా, మిస్ అయినా 94932 06459 వాట్సాప్ నంబర్ 'హాయ్' లేదా 'హెల్ప్' అనే మెసేజ్ పంపాలన్నారు. అనంతరం ఒక లింక్ వస్తుందని, అందులో వివరాలన్నీ పొందుపర్చితే పోగొట్టుకున్న ఫోన్ తిరిగి పొందవచ్చని తెలిపారు. దొరికిన సెల్‌ఫోన్లను సొంతానికి వాడుకోరాదని, దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌కు అందజేయాలని సూచించారు. అలాగే గుర్తు తెలియని వ్యక్తుల ద్వారా బిల్లులు లేని సెల్‌ఫోన్లు కొనుగోలు చేయవద్దని చెప్పారు.

# సోలార్‌కు పవర్



నిర్మాణంలో ఉన్న సోలార్ ప్యానల్ రా గ్లాస్ పరిశ్రమ

- తూర్పున మరో భారీ పరిశ్రమ
- ఐ.పంగిడిలో సౌర విద్యుత్ ప్యానల్ రా గ్లాస్ యూనిట్
- రూ.1,000 కోట్ల పెట్టుబడి
- శరవేగంగా నిర్మాణ పనులు
- ఉత్పత్తి సామర్థ్యం 840 టన్నులు
- 7 వేల మందికి ఉపాధి

**రానున్న కాలం సౌర విద్యుత్‌కే అధిక ప్రాధాన్యం. కాలుష్య రహితమైన సౌర విద్యుత్ వినియోగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రోత్సహిస్తున్నాయి. సోలార్ పవర్ ప్రాజెక్టులకు కేంద్రం సబ్సిడీలు అందిస్తోంది. విశాఖలో జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పారిశ్రామిక దిగ్గజం ముఖేష్ అంబానీ కూడా సౌర విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెట్టనున్నామని చెప్పారు. సౌర విద్యుదుత్పత్తిలో సోలార్ ప్యానల్స్ ఎంతో కీలకమైనవి. ఈ ప్యానెల్స్‌కు ఉపయోగించే రా గ్లాస్ తయారు చేసే భారీ పరిశ్రమ త్వరలో మన జిల్లాలో ప్రారంభం కానుంది.**

కొవ్వూరు: దక్షిణ భారతదేశంలోనే ఏకైక సోలార్ ప్యానల్ రా గ్లాసును ఉత్పత్తి చేసే పరిశ్రమ కొవ్వూరు మండలం ఐ.పంగిడిలో రూపు దిద్దుకుంటోంది. త్రివేణి రెన్యూవబుల్ సంస్థ రూ.1,000 కోట్ల వ్యయంతో 25 ఎకరాల విస్తీర్ణంలో దీనిని నెలకొల్పుతోంది. 840 టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ పరిశ్రమ ఏప్రిల్ 1న ప్రారంభం కానుంది. అదే నెల 15 నుంచి ఉత్పత్తి మార్కెట్‌లోకి విడుదలవుతుంది. మొదటిగా 240 టన్నుల సామర్థ్యంతో నడిచే ప్లాంటును ప్రారంభిస్తారు. వచ్చే ఏడాది నాటికి మరో 600 టన్నుల (300 + 300) సామర్థ్యం కలిగిన రెండు ప్లాంట్లు ప్రారంభమవుతాయి. ఈ పరిశ్రమ పూర్తయితే 2 వేల మంది ప్రత్యక్షంగా, మరో 5 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది. యూరోపియన్ సాంకేతిక పరిజ్ఞానంతో, అత్యాధునిక రోబోటిక్ నైపుణ్యంతో ఈ పరిశ్రమను నెలకొల్పుతున్నారు. కన్వేయర్ లైన్లపై గ్లాసు వెళ్లే ఏర్పాటు చేస్తున్నారు. పరిశ్రమకు అవసరమైన విద్యుత్‌ను దేవరపల్లి మండలం పల్లంట్ల నుంచి 33 కేవీ లైన్ ద్వారా సరఫరా చేయనున్నారు. అలాగే రోజుకు 35 వేల స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్‌ను ఈ పరిశ్రమకు గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (గెయిల్) పైపులైను ద్వారా సరఫరా చేయనుంది. ఇక్కడ తయారయ్యే సోలార్ ప్యానల్ రా గ్లాసును దేశవ్యాప్తంగా అందించనున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన సహాయ సహకారాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఆ సంస్థ ఎండీ వరుణ్ గుప్తా ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో కలిసి, పరిశ్రమ గురించి వివరించారు.

**ఇతర ప్రాంతాల నుంచి ముడిసరకు**

ఈ పరిశ్రమకు అవసరమైన ముడిసరకు వివిధ ప్రాంతాల నుంచి సరఫరా కానుంది. డోలమైట్, లైమ్‌స్టోన్ హిమాచల్‌ప్రదేశ్, ఈజిప్టు నుంచి; సోడియం కార్బొనేట్, సిలికాన్ శాండ్ గుజరాత్ నుంచి; సోడియం నైట్రేట్ నాగార్జున ఫెర్టిలైజర్స్ నుంచి; క్వార్ట్జ్ హైదరాబాద్ నుంచి; సోడియం హైడ్రాక్సైడ్ ఒడిశాలోని నేషనల్ అల్యూమినియం కంపెనీ (నాల్కో) నుంచి; సోడియం సల్ఫేట్ గుజరాత్, మధ్యప్రదేశ్ నుంచి; యాంటీమోనెట్ వివిధ దేశాల నుంచి దిగుమతి చేసుకోనున్నారు.



ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన పరిశ్రమ ఎండీ వరుణ్ గుప్తా

**దక్షిణాది రాష్ట్రాలకు సౌలభ్యంగా..**

ఇప్పటి వరకూ ఉత్తర భారత దేశంలోని గుజరాత్‌లో మాత్రమే ఇటువంటి పరిశ్రమ ఉంది. దీంతో సోలార్ ప్యానెల్స్‌కు ఉపయోగించే గ్లాసును గుజరాత్‌తో పాటు చైనా నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి. ఐ.పంగిడిలోని పరిశ్రమ పూర్తయితే మన రాష్ట్రంతో పాటు దక్షిణ భారత్‌లోని తమిళనాడు, కర్ణాటక, కేరళ, గోవా, తెలంగాణ రాష్ట్రాలకు రవాణా చార్జీల భారం తగ్గి, తక్కువ ధరకే సోలార్ ప్యానెల్స్ లభించే అవకాశం ఉంటుంది.

**ఇండస్ట్రియల్ జోన్‌గా..**

దేవరపల్లి – కొవ్వూరు మండలాల సరిహద్దుల్లోని ఐ.పంగిడి శివారు గ్రామం దేచెర్ల ఇండస్ట్రియల్ జోన్‌గా మారింది. విజన్ డ్రగ్స్, గౌతమీ కెమికల్స్, శుభోదయ కెమికల్స్, కరుటూరి సిరామిక్స్ వంటి పరిశ్రమలు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. మూడు దశాబ్దాల కిందట ఇదే త్రివేణి సంస్థ ఈ ప్రాంతంలో ప్యాటరన్ గ్లాస్ ఫ్యాక్టరీ నెలకొల్పింది. 120.90 టన్నుల సామర్థ్యంతో రెండు యూనిట్లను ఆ సంస్థ నిర్వహిస్తోంది. భవనాలకు ఉపయోగించే గ్లాస్ (గాజు) ఇక్కడ తయారు చేస్తారు. ఈ సంస్థ ఇప్పుడు సోలార్ ప్యానల్ రా గ్లాస్ పరిశ్రమను కూడా ప్రారంభిస్తూండటంతో.. రానున్న రోజుల్లో సోలార్ ప్యానల్స్ తయారు చేసే యూనిట్లు కూడా ఈ ప్రాంతానికి వచ్చే అవకాశాలున్నాయి. ఇదే ప్రాంతంలో నల్లరాతి క్వారీ పరిశ్రమ విస్తరించి ఉంది. వందల సంఖ్యలో నల్లరాతి క్వారీలు, క్రషర్లు నడుస్తున్నాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో నిర్మాణ పనులకు, రోడ్లకు వినియోగించే నల్లకంకరను ఇక్కడి నుంచే సరఫరా చేస్తున్నారు. ఇలా అనేక పరిశ్రమలు రావడంతో రానున్న రోజుల్లో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### వచ్చే నెల 1న ప్రారంభం



**త్రివేణి రెన్యూవబుల్** పరిశ్ర**మలో 240 టన్నుల** యూని**ట్‌ను వచ్చే నెల 1**వ తేదీన **ప్రారంభిస్తున్నాం.** అదే నెల **15 నుంచి ఉత్పత్తి** ప్రారంభ**మవుతుంది. వచ్చే** ఏడాదికి 600 టన్నుల **సామర్థ్యంతో మరో** రెండు యూనిట్లు ప్రారంభి**స్తాం. లోడింగ్,** అన్‌లోడింగ్‌కు రోబోటిక్ **టెక్నాలజీ వాడుతున్నాం.**

**- ఎస్‌బీ మిశ్రా, వైస్ చైర్మన్, త్రివేణి రెన్యూవబుల్ పరిశ్రమ, ఐ.పంగిడి**

# కమనీయం.. నరసన్న కల్యాణం



అలరించిన శక్తి వేషాలు



స్వామి, అమ్మవార్ల కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న పండితులు



రథోత్సవాన్ని ప్రారంభించిన హోంమంత్రి వనిత. పక్కన కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే జక్కంపూడి తదితరులు



భక్తజన కోలాహలం మధ్య సాగిన నరసింహుని రథోత్సవం

- కోరుకొండకు పోటెత్తిన భక్తజనం
- రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన హోం మంత్రి వనిత
- పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే రాజా

**మధురపూడి:** కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం శుక్రవారం కమనీయంగా సాగింది. రాత్రి 10.33 గంటలకు అమ్మవారికి అర్చకులు మంగళసూత్ర ధారణ చేయించారు. వైఖానస ఆగమం ప్రకారం స్వామివారి కల్యాణ క్రతువు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రభుత్వం తరఫున హోం మంత్రి తానేటి వనిత పట్టు వస్త్రాలను అందజేశారు. పండితులు పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు, దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ, ఎస్వీ రంగరాజ భట్టర్, అర్చక స్వాముల పర్యవేక్షణలో కల్యాణ వేడుక కమనీయంగా జరిగింది.

**కొండెక్కడం మధురానుభూతి : హోంమంత్రి**

కోరుకొండ ఎక్కడం మధురానుభూతి అని, అక్కడ కొలువుదీరిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకోవడం ఎంతో అదృష్టమని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత అన్నారు. రథోత్సవంలో పాల్గొన్న వనిత విలేకరులతో మాట్లాడుతూ స్వామివారిని 650 మెట్లు ఎక్కి దర్శించుకున్నానన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో ఉండేలా చూడాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు. కోరుకొండకు రోప్ వే ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భక్తులకు మరింతగా సౌకర్యాలు కల్పించడానికి చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. రుడా చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, అన్నవరం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు తాడి రజనీరెడ్డి, ఏసీ రమేష్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**అపశ్రుతి**

స్వామివారి రథయాత్రలో అపశృతి చోటు చేసుకుంది. రథం కొండవద్ద నుంచి దేవస్థానం రోడ్డు మీదుగా సాయినగర్‌కు చేరుకోగా కాపవరానికి చెందిన కాపవరపు నాగబాబు రథం కొద్దిసేపు లాగారు. ఆ సమయంలో ఆయన కాలు రథం చక్రం కింద నలిగిపోయింది. రాజానగరం మండలం దివాన్‌చెరువుకు చెందిన కూర్మదాసు శ్రీనివాస్‌కు కూడా స్వల్పగాయాలయ్యాయి. వీరిద్దరినీ రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఎమర్జెన్సీ విభాగంలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆయన సతీమణి రాజశ్రీ ఆస్పత్రికి వెళ్లి వారి పరిస్థితిపై ఆరా తీశారు.

**కనుల పండువగా రథోత్సవం**

కల్యాణోత్సవానికి విచ్చేసిన భక్తులతో ఉదయం నుంచే కోరుకొండలోని వీధులన్నీనిండిపోయాయి. భక్తులు సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం 1-56 గంటలకు అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు. గరగ నృత్యం, బ్యాండ్ మేళాలు, కోలాటం, తీన్‌మార్, శక్తి వేషధారణలు, కేరళ డ్రమ్స్ వాయిద్యాలతో, భక్తుల గోవిందనామ స్మరణతో రథయాత్ర వైభవంగా నిర్వహించారు. కొండ దగ్గర నుంచి ప్రారంభమైన రథోత్సవం రెడ్డి పంతులు సత్రం మీదుగా పాత సంతమార్కెట్, మత్స్యకారుల వాడ, ఎయిర్‌టెల్ టవర్, సాయిబాబా గుడి, అంకాలమ్మ గుడి, శివాలయం మీదుగా సాయంత్రం 6 గంటలకు దేవస్థానానికి చేరుకుంది. మేళతాళాలతో ఎదుర్కోలు నిర్వహించి నరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవార్లను ఆలయంలోకి తోడ్కొని వెళ్లారు.

# మత్స్యకారుల వలలో భారీ కోణాలు



మత్స్యకారులకు చిక్కిన కోణెం చేపలు

**రూ.10 లక్షలకు పైగా వ్యాపారం**

**కొత్తపల్లి:** అమీనాబాద్ శివారు చేపలరేవులో శుక్రవారం మత్స్యకారులకు చిక్కిన భారీ కోణాలు వారికి కాసుల పండించాయి. బోట్లపై వేటకు వెళ్లగా రూ.10లక్ష విలువ చేసే కోణెం చేపలు వలలకు చిక్కాయి. ఈ చేపలను వ్యాపారులు తమిళనాడు, కేరళ, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో కోణాల చేపల వ్యాపారం భారీగా జరుగుతోందని మత్స్యకారులు తెలిపారు.



# మండుటెండలో పరుగుల పరీక్ష

- సొమ్మసిల్లి పడిపోయిన 25 మంది విద్యార్థినులు
- సకాలంలో వైద్యం అందడంతో తప్పిన ప్రాణాపాయం
- ఖేలో ఇండియా అంటూ అధికారుల నిర్వాకం
- ఆగ్రహం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు

**అంబాజీపేట:** ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా రన్నింగ్‌లో పాల్గొన్న 10వ తరగతి విద్యార్థినులు ఎండధాటికి తాళలేక సొమ్మసిల్లి పడిపోవడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఉదయం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఖేలో ఇండియాలో భాగంగా ఆరు ఈవెంట్‌లలో పోటీలను నిర్వహించేందుకు పాఠశాల ప్లే గ్రౌండ్ చుట్టూ మూడు రౌండ్లు పరుగు పెట్టాలని విద్యార్థినులను పీఈటీ ఆదేశించారు. ఉదయం 11.30 గంటలకు మండుటెండలో పరుగు పెట్టడంతో 25 మంది విద్యార్థినులు సొమ్మసిల్లి పడిపోయారు. తీవ్ర అస్వస్థతకు గురైన వీరికి అధికారులు సకాలంలో వైద్య సేవలు అందించడంతో ప్రాణాపాయం తప్పింది.



అస్వస్థతకు గురైన విద్యార్థికి పండ్లు అందిస్తున్న ఆర్డీఓ ముక్కంటి, డీఎంఅండ్‌హెచ్‌వో దుర్గారావుదొర

వీరిలో కొంత మందికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, ఆయాసం, వాంతులు వంటి లక్షణాలు రావడంతో హైస్కూలు ఎదురుగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మరికొంత మందిని హైస్కూల్‌లో ఉంచి వైద్యం చేశారు. ఎస్.నవ్యశ్రీ, ఎ.అభినయ, ఎం.లహరి, ఎ.తనూష శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది రావడంతో ఆక్సిజన్ ఏర్పాటు చేశారు. కె.అనితకు శ్వాసకోశ సమస్యతో పాటు నీరసంగా ఉండటంతో ప్రత్యేక వైద్య సేవలు అందించారు. వీరంతా కోలుకోవడంతో హెచ్‌ఎం బీర హనుమంతరావు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో తిరిగి పాఠశాలకు పంపించారు.



విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

**ఎవరు బాధ్యత వహిస్తారు?**

మండుటెండలో విద్యార్థినులు గ్రౌండు చుట్టూ పరిగెడుతున్నా ఏ ఉపాధ్యాయుడు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడంపై విద్యార్థుల తల్లితండ్రులు విమర్శిస్తున్నారు. వారికి ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని హెచ్‌ఎం హనుమంతరావును ప్రశ్నించగా ఆ సమయంలో హైస్కూల్‌లో తాను లేను అని, ఈవెంట్ నిర్వహిస్తున్న విషయం తనకు తెలియదని చెప్పారు. పబ్లిక్ పరీక్షకు వెళ్లే పదవ తరగతి విద్యార్థులను శ్రద్ధగా చదివించకుండా ఇటువంటి క్రీడలు, ఈవెంటులు నిర్వహించడం ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

**వైద్య సేవలు అభినందనీయం : డీఎంఅండ్‌హెచ్‌వో**

అస్వస్థతకు గురైన విద్యార్థినులకు సకాలంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ వి.గౌతమి, సిబ్బంది ఆధ్వర్యంలో అందించిన సేవలు అభినందనీయమని డీఎంఅండ్‌హెచ్‌వో ఎం.దుర్గారావుదొర అన్నారు. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఇటువంటి పరీక్షలను నిర్వహించకూడదన్నారు. ఎండ తీవ్రత వల్ల బాలికలు స్పృహ కోల్పోయారన్నారు. ఈ విద్యార్థులు పూర్తి స్థాయి విశ్రాంతితో పాటు పోషకాహారం తీసుకోవాలని సూచించారు.

**పునరావృతం కాకుండా చర్యలు : ఆర్డీవో**

అంబాజీపేట హైస్కూల్‌లో జరిగిన ఘటన దురదృష్టకరమని, విద్యార్థులందరికీ ప్రాణాపాయం తప్పిందని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి అన్నారు. భవిష్యత్‌లో అకాల దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ జె.కనకదుర్గ, హెచ్‌ఎం హనుమంతరావుకు సూచించారు. అనంతరం అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించి, పండ్లను పంపిణీ చేశారు.



# ఉపాధ్యాయుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

**పాఠశాలలను తనిఖీ చేసిన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్**

**పెద్దాపురం:** విద్యకు ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వానికి మచ్చ తెస్తున్నారు, ఉపాధ్యాయులు కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదంటూ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి హైస్కూల్‌లో శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ జరిపారు. ఆర్జేడీ నాగమణి, జిల్లా విద్యాశాఖాధికారి అన్నపూర్ణ, డీవైఈఓ సుభద్రలతో ఆయన వెంట ఉన్నారు. ప్రవీణ్ ప్రకాష్ నేరుగా పాఠశాల గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. వాళ్లకు బోధించారు. ఆయన ప్రశ్నలకు విద్యార్థులు సమాధానం ఇవ్వలేకపోవడంతో క్లాస్ టీచర్, హెచ్‌ఎం, ఎంఈఓ, డీవైఈఓ, డీఈఓల తీరుపై మండిపడ్డారు. బోధనలో నిర్లక్ష్యంగా వ్యవరించిన వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆర్జేడి నాగమణిని ఆదేశించారు. పాఠశాలలో ఉన్న ఆయాలు, మధ్యాహ్న భోజనం వడ్డించే కుక్‌లతో మాట్లాడుతూ మీ జీతం ఎంత అని ప్రశ్నించారు. రూ.ఆరు వేలు అంటూ ఆయా సమాధానం ఇవ్వగా జీతం సక్రమంగా అందుతోందా అని ప్రశ్నించారు. డిసెంబర్ వరకే జీతాలు ఇచ్చారని, రెండు నెలల బకాయిలు ఉన్నాయని చెప్పడంతో ఎందుకు జీతాలు ఇవ్వలేదని సంబంధిత అధికారిని ప్రశ్నించారు. సీఎఫ్‌ఎంఎస్ కారణంగా జీతాలు ఆలస్యం అయ్యాయని సమాధానం రావడంతో సిబ్బందిపై మండిపడ్డారు. నాకు ప్రతీ నెలా సక్రమంగా అందుతున్నప్పుడు కింది సిబ్బందికి ఎందుకు ఇవ్వలేకపోతున్నారు.? వచ్చే నెల నుంచి ఆయాలకు, కుక్‌లకు జీతాలు ఇచ్చిన తరువాతే ఎవరికైనా జీతాలు మంజూరు కావాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.180 కోట్లు జీతాలుగా ప్రభుత్వం ఇస్తుంటే కొంతమంది జీతాలు తీసుకుని న్యాయం చేయకపోవడం తగదన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను సక్రమంగా వాడుతున్నదీ లేనిదీ పరిశీలించారు.



కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి హైస్కూల్‌లో అధికారులకు ఆదేశాలు ఇస్తున్న ప్రవీణ్ ప్రకాష్

**ముకుందవరంలోనూ ఆకస్మిక తనిఖీ**

**రంగంపేట:** మండలంలోని ముకుందవరం జెడ్పీ హైస్కూల్‌ను ప్రవీణ్‌ప్రకాష్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఒక తరగతి గదిలో కొంతమంది విద్యార్థులు బెంచిపై కాకుండా కింద కూర్చోవడం, ఇంగ్లిష్ టీచర్ వేరే సబ్జెక్ట్ బోధించడం, పీడీ లెక్కలు చెప్పడం వంటి విషయాలను ఆయన గుర్తించారు. ఉపాధ్యాయులపై అసహనం వ్యక్తం చేశారు. ఇక నుంచి విద్యార్థులు బెంచీలపైనే కూర్చోవాలని, ఉపాధ్యాయులు ఎవరి సబ్జెక్టులు వారే బోధించాలని సూచించారు. మనబడి నాడు-నేడు పథకంలో పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్ది కార్పొరేట్ స్థాయిలో విద్యనందిస్తున్నట్టు చెప్పారు. బోధన కూడా అదేవిధంగా ఉండాలన్నారు. డీఈఓ ఎస్.అబ్రహం, డీవైఈఓ తిరుమలదాసు, ఎంఈఓ కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు. సామర్లకోట, మండపేట, గోకవరం తదితర ప్రాంతాల్లో కూడా పాఠశాలలను ప్రవీణ్ ప్రకాష్ తనిఖీ చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి జవాబులు తెలుసుకున్నారు.

## క్రైం కార్నర్..

### మనస్తాపంతో ఆత్మహత్య

**సీతానగరం:** అమ్మమ్మ వద్ద ఉంటూ ఒంటరితనం భరించలేక మనస్తాపంతో బొబ్బిల్లంకలో సబ్బువరపు నాగదేవి (19) ఉరి వేసుకుని ఆత్మహత్యకు చేసుకుంది. ఎస్సై కె.శుభశేఖర్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బొబ్బిల్లంకకు చెందిన సబ్బువరపు నాగదేవి తల్లిదండ్రులు పదేళ్ల క్రితం విడిపోయారు. తల్లి నాగరత్న ఏడాది క్రితం రెండవ వివాహం చేసుకుని ఖమ్మం వెళ్లింది. తండ్రి సత్తిబాబు జగ్గంపేటలో ఉంటున్నాడు. అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్న నాగదేవి పదవ తరగతి చదివి ఇంటివద్ద ఉంటోంది. తాత కట్టోజు రాముడు, అమ్మమ్మ పొలం పనులకు వెళ్లిన తరువాత ఉదయం 10 గంటలకు ఇంటి దూలానికి తన చున్నీతో ఉరి వేసు కుని ఆత్మహత్యకు పాల్పడింది. స మాచారం అందుకున్న ఎస్సై శుభశేఖర్ మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాత రాముడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



నాగదేవి మృతదేహం

### బంగారు ఆభరణాల చోరీ

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని ఆదివారపుపేటకు చెందిన కొండా వీరదుర్గకు చెందిన ఏడు కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురి కావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. వీరదుర్గ గత ఏడాది డిసెంబరు 24న హైదరాబాద్ నుంచి ఒక ఫంక్షన్‌కు ఆదివారపుపేటకు వచ్చారు. తన హేండ్‌బ్యాగు హేంగర్‌కు తగిలించారు. సాయంత్రం హేండ్ బ్యాగులో ఉంచిన ఏడు కాసుల బంగారు హారం, చెవిదిద్దులు చోరీకి గురైనట్లు గుర్తించారు. హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం వరకు రైలులో రావడంతో ట్రైన్‌లోనే దొంగతనం జరిగిందని అనుమానించి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే రైల్వే పోలీసుల నుంచి వచ్చిన రిపోర్టు ఆధారంగా గురువారం కేసు రీ రిజిస్ట్రేషన్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

### చోరీ కేసులో మూడు నెలల జైలు

**మండపేట:** పట్టణంలో రెండు చోరీ కేసుల్లో ముద్దాయికి మూడు నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ శుక్రవారం ఆలమూరు జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ డాక్టర్ కె.దీవదైవకృప తీర్పునిచ్చారు. పట్టణ ఎస్‌ఐ ఎం.అశోక్ తెలిపిన వివరాల మేరకు గత ఏడాది పట్టణంలోని గాంధీనగర్‌లో మోటారు సైకిల్, విజయలక్ష్మినగర్‌లోని జిమ్‌లో టీవీ చోరీ కాగా బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేశారు. దర్యాప్తులో రాయుడు దుర్గారావును అరెస్టుచేసి అతని వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువుకావడంతో దుర్గారావుకు శిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారని ఎస్‌ఐ అశోక్ తెలిపారు. ఏపీపీగా విల్లా శ్రీరాములు కేసును వాదించారన్నారు.

## క్లుప్తంగా

### సోమాలమ్మ జాతర మహోత్సవం



అమ్మవారి సన్నిధిలో రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీటీఆర్ఐ: శ్యామలానగర్‌లోని సోమాలమ్మ జాతర మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 7వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. అలాగే రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు దర్శించుకున్నారు.

### కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న రావిపాటి సందీప్, చిత్రంలో రామచంద్రరావు తదితరులు

కడియం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావిపాటి రామచంద్రరావు తన పుట్టిన రోజు సందర్భంగా ఇటీవల కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షల అనంతరం కళ్లజోళ్లు అవసరమైన వారిని గుర్తించి, వారికి శుక్రవారం కళ్లజోళ్లు అందజేశారు. వేమగిరిలో రావిపాటి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన కుమారుడు రావిపాటి సందీప్ చేతుల మీదుగా వాటిని అందించారు. అలాగే ఆపరేషన్లు అవసరమైన వారికి కూడా ఆపరేషన్లు చేయించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### రామచంద్రస్వామికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సీతారామచంద్రులు

కడియం: దుళ్లలోని ఆర్యవైశ్య కోదండ రామాలయంలో శుక్రవారం పంచామృతాలు, వివిధ రకాల పండ్లరసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని వేదపండితులు బాదంపూడి శివయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా హనుమత్, లక్ష్మణ, సీతాసమేత రామచంద్రస్వామికి పూజలు చేశారు.

### 8న మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

ప్రకాశం నగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 8న మహిళ ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏపీఎన్‌జీవో నగర సంఘం అధ్యక్షుడు సుబ్బారావు నాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎన్‌జీవో హోంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం పరిధిలో వివిధ శాఖాల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. నగర కార్యదర్శి ప్రవీణ్, వేణుమాధవరావు, వసుధ, హిమగిరి పాల్గొన్నారు.

### ఘనంగా సత్కారం



ముద్దాల అనును సత్కరిస్తున్న నాయకులు

కడియం: వైఎస్సార్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన ముద్దాల అనుకు శుక్రవారం సత్కారం చేశారు. బుర్రిలంకలోని ఈశ్వర ఫామ్ నర్సరీ అధినేత, కడియం మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, హితకారిణి సంస్థ డైరెక్టర్ దేవులపల్లి సరితాదేవి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరానికి చెందిన ఎస్.మురళీకృష్ణ (49) ఎస్‌వీ జనరల్ మార్కెట్‌లోని షాపులో పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. గత నెల 28వ తేదీన మేడమీద నుంచి జారిపడిపోయాడు. తీవ్రగాయాలైన అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈమేరకు బొమ్మూరు ఎస్సై శివాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కర్రీ.. డోంట్ వర్రీ

- నగరంలో పెరిగిన కర్రీ పాయింట్లు
- జోరుగా అమ్మకాలు




నగరంలోని ఓ కర్రీ పాయింట్ వద్ద కొనుగోలుదారులు

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరం శరవేగంగా విస్తరిస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి చదువులు, వ్యాపారులు, ఉద్యోగాల కోసం అనేక మంది నగరానికి వస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాకు రాజధానిగా మారిన తర్వాత ఇక్కడ అభివృద్ధి పరుగులు పెడుతోంది. దానికి అనుగుణంగానే అనేక వ్యాపారాలు విస్తరిస్తున్నాయి. వాటిలో ముఖ్యంగా కర్రీ పాయింట్లు బాగా పెరిగాయి. అన్ని ప్రధాన కూడళ్లలో ఇవి విస్తరించాయి. నగరానికి వచ్చిన ఉద్యోగులు, విద్యార్థులతో పాటు చాలామంది స్థానికులు కూడా అక్కడే కొనుగోలు చేస్తున్నారు. నందం గనిరాజు జంక్షన్, దానవాయిపేట, ప్రకాశం నగర్ రౌండ్ పార్కు, జాంపేట, కంబాలచెరువు, కోటిపల్లి బస్టాండ్.. ఇలా అన్నిచోట్లా అనేక కర్రీ పాయింట్లు ఏర్పాటు చేశారు. నగరానికి వచ్చే ఉద్యోగులు, చదువుకునే విద్యార్థులతో పాటు ఇతర పనుల మీద, ఆసుపత్రులకు వచ్చే రోగులకు, వారి బంధువులకు కావాల్సిన అన్నం, కూరలు, సాంబారు, పెరుగు, పచ్చడి కర్రి పాయింట్లలో లభిస్తున్నాయి. దీంతో ప్రజలు వాటివద్ద క్యూ కడుతున్నారు. వీటితో పాటు చికెన్ కర్రీ, చేపల పులుసు, రొయ్యల వేపుడు ఇలా అన్ని రకాలు అందుబాటులో ఉంటున్నాయి.

**ప్రత్యేక కౌంటర్**

గతంతో పోలిస్తే ఇప్పుడు హోటల్‌కు వచ్చే వినియోగదారుల సంఖ్య తగ్గింది. హోటల్‌కు వచ్చి తినే వారితో పోలిస్తే ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ, టేక్‌అవే డెలివరీల సంఖ్య పెరిగింది. వీటితో పాటు వివిధ రకాల వెజ్ అండ్ నాన్‌వెజ్ కర్రీలు, రైస్, బిర్యానీ వంటి అన్ని రకాల ఆహార పదార్థాలను విక్రయించేందుకు ప్రత్యామ్నాయ కౌంటర్‌ను ఏర్పాటు చేసి కొనుగోలుదారులకు అందిస్తున్నాం.
– ఆర్.సూర్యనారాయణ, హోటల్ నిర్వాహకుడు

**నిమిషాల వ్యవధిలోనే..**

నగర వాసుల్లో అత్యధిక శాతం భార్యభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తారు. దీంతో ఉదయమే ఉద్యోగాలకు, వ్యాపారాలకు వెళ్లిపోతారు. వారికి మధ్యాహ్నం భోజన సమయానికి ఆయా ప్రాంతాల్లోని కర్రి పాయింట్లు ఆసరాగా నిలుస్తున్నాయి. వీటితో పాటు జోమోటో, స్విగ్గీ వంటి ఫుడ్ డెలివరీ యాప్‌లు ప్రజలకు అందుబాటులోకి రావడంతో కేవలం నిమిషాల వ్యవధిలోనే వారు కోరుకున్న ఆహారం ఇంటి ముందుకు వస్తోంది. కర్రి పాయింట్లో వివిధ రకాల కూరలు అందుబాటులో ఉండడంతో పాటు ధర తక్కువ ఉండటం, నాణ్యత కూడా బాగానే ఉండడంతో జనం ఆసక్తి చూపుతున్నారు.

**ఉపాధికి ఊతం**

కర్రి పాయింట్ వ్యాపారం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మంది ఉపాధి కల్పిస్తోంది. జాంపేట, నందం గనిరాజు జంక్షన్ వంటి ప్రాంతాల్లో కర్రి పాయింట్లను మహిళలే నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో పోటీ పరీక్షలకు సంబంధించిన పలు కోచింగ్ సెంటర్లు ఉండడంతో ఇక్కడ విద్యార్థులు ఎక్కువగా ఉంటున్నారు. ఈ ప్రాంతాల్లో కర్రి పాయింట్లు అధికంగా ఉండడంతో బియ్యం, కిరాణా, కూరగాయలు, ఆకుకూరలు వంటి వ్యాపారాలు సైతం పుంజుకుంటున్నాయి. కర్రి పాయింట్ల జోరుకు నగరంలోని పలు సెంటర్లలో ఉన్న హోటళ్ల యాజమానులు సైతం హోటల్‌తో పాటు ప్రత్యామ్నాయ కౌంటర్లు ఏర్పాటు చేయడం విశేషం.

## బొమ్మన రాజ్‌కుమార్ సేవలు చిరస్మరణీయం



బొమ్మన రాజ్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: ప్రముఖ వ్యాపారవేత్త, వైఎస్సార్ సీపీ నాయకుడు దివంగత బొమ్మన రాజ్‌కుమార్ సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. ఆయన జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కోటగుమ్మం సెంటర్‌లో వైఎస్సార్ సీపీ కార్మిక సంఘం నాయకుడు అడపా రాజు ఆధ్వర్యంలో కార్మిక సంఘాల ప్రతినిధులు, బీఆర్కే సిబ్బంది, సబ్‌వే వర్తకులు, అభిమానుల ఆధ్వర్యంలో జయంత్యుత్సవం నిర్వహించారు. రాజ్‌కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కాలే చిన్ని, కుమార్, మణికంఠ, మల్లాడి వెంకటేష్, కోలా రాజేంద్ర, కొడమటి మోహన్, అనసూరి శ్యామ్, వై.శ్యామ్ పాల్గొన్నారు.

# నేటి కంటే మర్నాడు మెరుగ్గా ఉండాలి

- నాడు– నేడు, జగనన్న కిట్ల విషయంలో రాజీ ప్రసక్తే లేదు
- పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, కలెక్టర్ మాధవీలత

కంబాలచెరువు: నాడు – నేడు పనులు, విద్యార్థులకు అందించే జగనన్న కిట్ల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ఇది విద్యాశాఖకు అత్యంత ప్రతిష్టాత్మకమని పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ అన్నారు. వీటి పంపిణీలో ఎవరైనా అలసత్వం వహించే సహించేది లేదన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం రాజమహేంద్రవరం వచ్చారు. నగరంలోని నన్నయ మున్సిపల్ స్కూల్, ఆర్యాపురం పంతం సత్యనారాయణ హైస్కూల్, తుమ్మలావ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాబోధన, ఫలితాల్లో నేటి కంటే మర్నాడు మరింత మెరుగ్గా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు, పిల్లల్లో పౌష్టికాహార లోపం అధిగమించేందుకు, సచివాలయ వ్యవస్థ ద్వారా మెరుగైన పౌరసేవలను అందించడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఉపాధ్యాయులకు, పిల్లలకు అందజేసిన ట్యాబ్‌లకు సంబంధించి వారు వాడిన నిమిషాల ఆధారంగా ర్యాంకింగ్ ఇస్తామన్నారు. 7500 నిమిషాలు ఐతే డిస్టింక్షన్, 6 వేలు అయితే ఫస్ట్ డివిజన్, 3 వేలు అయితే పాస్ అయినట్లు అని పిల్లలకు తెలిపారు. వర్క్‌బుక్స్ పరిశీలించి విద్యార్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**సచివాలయం సందర్శన**

పాఠశాలల పరిశీలన అనంతరం ఆయన నగర పాలక సంస్థ పరిధిలోని 35, 36, 37 వార్డు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందజేస్తున్న పౌర సేవల వివరాలను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో మొబైల్ యాప్ ద్వారా ఆ సచివాలయం ద్వారా ప్రయోజనం కలుగుతున్న వారి డేటా, వారికి అందజేసిన సంక్షేమ పథకాలను పరిశీలించారు. ఆయన వెంట కలెక్టర్ కె.మాధవీలత, మునిసిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు. ఇప్పటి వరకూ పరిశీలించిన స్కూళ్లలో రాజమహేంద్రవరంలోని విద్యార్థులు నూటికి నూరుశాతం షూ, యూనిఫాం, బెల్టులు ధరించి వచ్చారన్నారు. దీనిపై డీఈవో అబ్రహంను అభినందించారు. జగనన్న విద్యాకానుక కిట్లు నాణ్యతగా లేవని, అందుకు ఎవ్వరూ వేసుకోవడం లేదన్న ఆరోపణలు నిరాధారమని రుజువయ్యాయన్నారు. తుమ్మలావ స్కూల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించారు. ముందుగా రాజమహేంద్రవరం వచ్చిన ప్రవీణ్ ప్రకాశ్‌కు కలెక్టర్ మాధవీలత మొక్క అందజేసి స్వాగతం పలికారు.

# వైభవంగా శేషవాహన సేవ



శేషవాహనంపై మదన గోపాలస్వామి

కడియం: దుళ్లలోని రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి శేషవాహన సేవ వైభవంగా జరిగింది. కోలాట భజన బృందాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ స్వామివారి ఊరేగింపులో గ్రామస్తులు పాల్గొన్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీమాన్ ఖండవిల్లి రాధాకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో శుక్రవారం రాత్రి కల్యాణ కన్నుల పండువగా జరిగింది. ఆయా కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అలాగే శనివారం ప్రత్యేక హోమాలు, ఆదివారం వేద ఆశీర్వచనం, సోమవారం నిత్యహోమాలు నిర్వహించనున్నారు. మంగళవారం పూర్ణాహుతి, చక్రస్నానం అనంతరం ఉదయం 11 గంటల నుంచి భక్తులు, దాతల సహకారంతో అన్నసమారాధన జరుగుతుంది. బుధవారం రాత్రి శ్రీపుష్పమహోత్సవం నిర్వహిస్తారు.

## ఈశాన్య రాష్ట్రాల్లో విజయంపై బీజేపీ సంబరాలు



విజయోత్సవం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, నాగాలాండ్, మేఘాలయలో బీజేపీ విజయం సాధించడంతో స్థానిక కోటగుమ్మం సెంటర్‌లోని శివుని బొమ్మ శుక్రవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు మాట్లాడుతూ ఈ విజయంలో ప్రధాని నరేంద్ర మోదీ, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ముఖ్యమైన పాత్ర పోషించారన్నారు. బీజేపీ విజయ పరంపర రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కొనసాగడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అన్యభాషా సెల్ కోకన్వీనర్ లలిత్ జైన్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల వెంకట్రావు, రాష్ట్ర ఓబీసీ మోర్చా లీగల్ సెల్ కన్వీనర్ పడాల నాగరాజు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరామ్ పాల్గొన్నారు.

# ప్రవీణ్ కుమార్‌కు అభినందనలు



ప్రవీణ్ కుమార్‌ను అభినందిస్తున్న బొమ్ముల దత్తు, యానాపు ఏసు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: బంగ్లాదేశ్‌తో జరిగే దివ్యాంగుల టీ20 సిరీస్ కోసం భారతజట్టుకు ఎంపికైన ధవళేశ్వరానికి చెందిన కాతేరు గ్రామపంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ మానుకొండ ప్రవీణ్ కుమార్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు యానాపు ఏసు ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు సత్కరించారు. శుక్రవారం కాతేరు గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రవీణ్ కుమార్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు అభినందించారు. ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ భారత జట్టు బౌలర్‌గా ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. కాలెపు సత్యసాయిరామ్, భీమవరపు సూరిబాబు, పిచ్చుక రాంబాబు, టి.నాగేశ్వరరావు, ఎం.రాంబాబు, కండెళ్ల సురేష్ పాల్గొన్నారు.

ధవళేశ్వరం: ప్రవీణ్ కుమార్‌ను కరాటే అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కర్రి నాగిరెడ్డి, జిల్లా సెక్రటరీ బి శ్రీనివాసరావు, ట్రెజరర్ అవాల త్రిమూర్తులు పాల్గొన్నారు.

## అన్నసమారాధన

కడియం: మండల కేంద్రమైన కడియంలోని పడాల వారి వీధిలో ఇటీవల పునర్నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## నిషేధిత ప్లాస్టిక్ స్వాధీనం

ప్రకాశం నగర్: నగరపాలక సంస్థ అధికారులు శుక్రవారం నగరంలోని మోరంపూడి రోడ్డు, తిలక్ రోడ్డు, ఏవీ అప్పారావు రోడ్డు, ఎస్‌వీజీ మార్కెట్ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 1.4 టన్నుల ప్లాస్టిక్‌ను వ్యాపారుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. రూ.మూడు వేల అపరాధ రుసుం విధించారు. నిషేధిత ప్లాస్టిక్‌కు బదులుగా గుడ్డ, జౌళి సంచులు వాడాలని వ్యాపారులకు సూచించారు. ఈ దాడుల్లో జేఎస్ఆర్ అన్నమయ్య, షహీదా, బాలరాజు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా పోటీలకు సూర్య



సూర్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజబాబు

సీటీఆర్ఐ: దుబాయ్‌లో వచ్చేనెల జరగనున్న అంతర్జాతీయ యోగా చాంపియన్‌షిప్‌కు ఎస్‌కేవీటీ కళాశాల బీఎస్సీ మొదటి సంవత్సరం విద్యార్థి టి.సూర్య అర్హత సాధించాడని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 26 నుంచి 30 వరకూ కర్ణాటకలో జరిగిన జాతీయ యోగా పోటీల్లో సూర్య ప్రథమ స్థానంలో నిలిచి, అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. కాగా.. సూర్యకు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

# అంగరంగ వైభవంగా..



స్వామివారికి పట్టువస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డాక్టర్ రాజశ్రీ దంపతులు



స్వామికి పూజలు చేస్తున్న మంత్రి వనిత, కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండలోని లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు అంగరంగా వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం జరిగిన రథోత్సవానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అన్నవరం వీరవెంకట సత్యనారాయణస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకూ ఉత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత స్వామివారి రథాన్ని ప్రారంభించగా, దేవస్థానం అనువంశిక ధర్మకర్త ఎస్పీ రంగరాజ బట్టర్ కుంభాన్ని పగలగొట్టారు. భక్తులు శుక్రవారం ఉదయమే స్థానిక దేవుని కోనేటిలో స్నానమాచరించారు. కొండపైన కొలువుదీరిన స్వయంభు నరసన్నను దర్శించుకున్నారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. కోరుకొండ పంచాయతీ, మండల పరిషత్ అధికారులు కోనేటిని శుభ్రం చేసి, భక్తులకు అనువుగా తీర్చిదిద్దారు.

**రెడ్డి పంతులు సత్రం దాతృత్వం**

స్థానికంగా ఈ సత్రాన్ని ఉత్సవాల కొచ్చే భక్తులకు భోజన సదుపాయం కల్పించాలన్న లక్ష్యంతో రెడ్డి పంతులు ఏర్పాటు చేశారు. వందల ఏళ్లుగా ఉత్సవాల సందర్భంగా భక్తులకు భోజనాన్ని అందిస్తున్నారు. ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకూ రెండు పూటలా ఈ కార్యక్రమం జరుగుతుంది.

**స్థానికుల వితరణ**



మెట్ల మార్గంలో కొండపైకి వెళుతున్న మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

స్వామివారి కల్యాణోత్సవాలకు వచ్చిన భక్తులకు స్థానికులు పులిహోరా, వెజ్ బిర్యాని, పెరుగు అన్నం, మజ్జిగ తదతర వాటిని వితరణ చేశారు. దేవస్థానం రోడ్డంతా ఇలా చేస్తున్న దాతలతో నిండిపోయింది. భోజనం, అల్పాహార శాలలు లేని రోజుల్లో మొదలైన ఈ సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది. నేటి నుంచి వివిధ వాహనాలపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తారు. దానిలో భాగంగా శనివారం గరుడ వాహనంపై ఊరేగింపు జరుగుతుంది.

## అన్యాక్రాంతమైన ఆస్తుల స్వాధీనానికి కృషి

రాజమహేంద్రవరం సిటీ: టీడీపీ పాలనలో రాష్ట్రంలో అన్యాక్రాంతమైన వక్ఫ్‌బోర్డు ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ మహమ్మద్ ఆరిఫ్ అన్నారు. శుక్రవారం స్థానిక జాంపేటలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమైన వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణకు ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడంపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



జాన్‌బాబు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: బైక్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో ఇంజినీరింగ్ విద్యార్థి తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా పైడిచింతపాడు గ్రామానికి చెందిన ముంగర జాన్‌బాబు (21) గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. దివాన్ చెరువులోని ఒక ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. గురువారం రాత్రి సమయంలో స్నేహితుని బైక్ తీసుకుని, మరో స్నేహితుడితో కలిసి రాజమహేంద్రవరం వచ్చాడు. తిరిగి వెళ్తుండగా దివాన్‌చెరువు జీరోపాయింట్ వద్ద బైక్‌ను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన జాన్‌బాబును రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బైక్ వెనుక స్నేహితుడికి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ జాన్‌బాబు శుక్రవారం ఉదయం మృతి చెందాడు. బొమ్మూరు ఎస్సై జగన్‌మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అరుణాచలానికి ఆర్టీసీ స్పెషల్ బస్సు




అరుణాచలం బయలుదేరిన ఆర్టీసీ బస్సు

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి శుక్రవారం అరుణాచలానికి ఆర్టీసీ స్పెషల్ బస్సు బయలుదేరింది. ఈ సందర్భంగా డిపో మేనేజర్ షేక్ షబ్బం మాట్లాడుతూ అరుణాచలం గిరి ప్రదక్షిణ కోసం నాన్ ఏసీ సూపర్ లగ్జరీ బస్సును భక్తులు బుక్ చేసుకుని బయలుదేరి వెళ్లారన్నారు. భక్తులు బస్సుకు సరిపడా ఉంటే ఎక్కడికైనా, ఎప్పుడైనా బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## సిందూర గణపతి విగ్రహ ప్రతిష్ఠోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు వాంబే కాలనీలో సింధూర గణపతి ఆలయ భక్తబృందం ఆధ్వర్యంలో షణ్ముఖపీఠం స్కందస్వామి పర్యవేక్షణలో సిందూర గణపతిస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, భక్తులు పాల్గొన్నారు.

## సినిమాలు

| | |
|---|---|
| శ్యామల | బలగం |
| సూర్యమినీ | అమిగోస్ |
| సూర్యప్యాలెస్ | ఆర్గానిక్ మామ హైబ్రీడ్‌అల్లుడు |
| స్వామి | వాల్తేరువీరయ్య |
| అశోక | సార్ |
| అనుశ్రీ | గ్యాంగ్‌లీడర్ |
| రాజా | సార్ |
| ఊర్వశి | గ్రంథాలయం, సాచి |
| రంభ | రిచిగోడిపెళ్లి, ఇవేకాక |
| మేనక | వీరసింహారెడ్డి |
| గీతాఅప్సర | వినరోభాగ్యము విష్ణుకథ |
| **నామవరం** | |
| వీఎస్ మహల్ | సార్ |
| **ధవళేశ్వరం** | |
| మురళీకృష్ణ | సార్ |


● కె. రామలక్ష్మి

**తెలుగు సాహిత్యలోకం నుంచి రచయిత్రి కె.రామలక్ష్మి (92) వీడ్కోలు తీసుకున్నారు. రచయిత్రిగా, ఆరుద్ర సతీమణిగా, మద్రాసు (చెన్నై) నగరంలో తెలుగువారి ప్రతినిధిగా, నాటి సాహితీ సమూహాలలో కీలకమైన వ్యక్తిగా, సినిమా రంగంలో రచయిత్రిగా ఆమె సాగించిన యాత్ర సుదీర్ఘమైనది. ఆమె మరణంతో ఒక కాలపు తెలుగు సాహితీ చరిత్రకు మిగిలిన ఆఖరు సాక్షి లేకుండా పోయినట్టయ్యింది.**

నివాళి

# ఆమె ప్రతి అక్షరం స్త్రీ పక్షం

## రచయిత్రి రామలక్ష్మి ఆరుద్ర కన్నుమూత

- అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నివాసంలో మృతి
- 100 కుపైగా పుస్తకాలు రాసిన రామలక్ష్మి
- జీవనజ్యోతి సినిమాకు ఉత్తమ కథా రచయితగా నంది అవార్డు
- జర్నలిస్టుగా, సెన్సార్ బోర్డు సభ్యురాలిగా సేవలు

ప్రముఖ రచయిత ఆరుద్ర సతీమణి కె.రామలక్ష్మి (92) కన్నుమూశారు. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆస్మాన్‌ఘడ్‌లో ఉన్న నివాసంలో తుదిశ్వాస విడిచారు. రామలక్ష్మి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా కోటనందూర్‌లో 1930 డిసెంబర్ 31న జన్మించారు. మద్రాస్ విశ్వవిద్యాలయంలో బీఏ పూర్తిచేశారు. ఆంగ్ల, ఆంధ్ర సాహిత్యం, ప్రాచీనాంధ్ర సాహిత్యం అభ్యసించారు. 1954లో ప్రముఖ కవి ఆరుద్రను వివాహం చేసుకున్నారు. వీరికి ఐదుగురు కుమార్తెలు. 1951 నుంచే రామలక్ష్మి రచనా ప్రస్థానం మొదలైంది. వివాహమైన తర్వాత 'రామలక్ష్మి ఆరుద్ర' కలం పేరుతో రచనలు చేశారు. మొత్తం 100 కు పైగా పుస్తకాలు రాశారు. ఆంధ్రపత్రికలో ఆమె సుదీర్ఘకాలం నిర్వహించిన 'ప్రశ్న జవాబు' శీర్షిక ప్రసిద్ధి చెందింది. విడదీసే రైలుబళ్లు, అవతలిగట్టు, మెరుపుతీగె, తొణికిన స్వర్గం, మానని గాయం, ఆణిముత్యం, పెళ్లి, ప్రేమించు ప్రేమకై, ఆడది, ఆశకు సంకెళ్లు, కరుణ కథ, లవంగి, ఆంధ్ర నాయకుడు, పాండురంగని ప్రతిజ్ఞ, నీదే నా హృదయం, అద్దం, ఒక జీవికి స్వేచ్ఛ వంటి కథా సంకలనాలను రామలక్ష్మి రచించారు. తెలుగు సాహిత్య రంగానికి చేసిన సేవలకుగాను ఆమెకు గృహలక్ష్మి, స్వర్ణకంకణం సహా పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు దక్కాయి.

**ఉత్తమ రచయిత్రిగా నంది అవార్డు...**

రామలక్ష్మి పలు సినిమాలకు కథలు అందించారు. 1975వ సంవత్సరంలో జీవన జ్యోతి సినిమా కథకు గాను అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నంది అవార్డు అందుకున్నారు. కాసా సుబ్బారావు నిర్వహించిన స్వతంత్ర దినపత్రికలో జర్నలిస్టుగా పని చేశారు. 1978లో ఉత్తమ జర్నలిస్టుగా రామానాయుడు అవార్డు అందుకున్నారు. పలు స్త్రీ సంక్షేమ సంఘాల్లో సేవలు అందించి మహిళల శ్రేయస్సు కోసం పాటుపడ్డారు. కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ రీజనల్ ప్యానెల్ సభ్యురాలిగా కూడా పనిచేశారు. రామలక్ష్మి ఆరుద్ర మృతిపట్ల పలువురు రచయితలు, సినీ, రాజకీయ, ఇతర రంగాల ప్రముఖులు సంతాపం తెలిపారు. శుక్రవారం సాయంత్రమే ఎస్‌ఆర్‌నగర్ శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలను నిర్వహించారు.

### స్టెల్లా మేరీ స్టూడెంట్

స్వస్థలం కాకినాడ అయినా కె.రామలక్ష్మి చదువు చెన్నైలోనే సాగింది. స్టెల్లా మేరీ కాలేజీలో చదువుకుని ఇంగ్లిష్ భాషలో పట్టు సాధించారు. 'ఐ యామ్ ఏ స్టెల్లామేరియన్' అని గర్వంగా చెప్పుకునేవారు. కాలేజీలో ఒక కార్యక్రమానికి అతిథిగా హాజరైన ప్రఖ్యాత జర్నలిస్టు ఖాసా సుబ్బారావు ఇంగ్లిష్‌లో ఉపన్యాసం ఇచ్చిన కె.రామలక్ష్మిని చూసి పరీక్షలు అయిపోయాక తనని కలవమని చెప్పారు. 'స్వతంత్ర' పత్రికలో ఇంగ్లిష్ విభాగంలో పాత్రికేయురాలిగా ఉద్యోగం ఇచ్చారు. 'తెలుగు స్వతంత్ర'కు ఎడిటర్‌గా ఉన్న ఖాసా సుబ్బారావు కోరిక మేరకు 'నడుస్తున్న చరిత్ర' కాలమ్ రాశారు రామలక్ష్మి. ఆమె ఇంటిలో ప్రతి సాయంత్రం సాహితీచర్చలు జరిగేవి. వాటికి ఆరుద్ర, శ్రీరంగం


● కుమార్తెలు విజయ, త్రివేణి, కవిత, లలిత, వాసంతిలతో ఆరుద్ర, రామలక్ష్మి

నారాయణబాబు, శ్రీశ్రీ తదితరులు హాజరయ్యేవారు. ఆరుద్ర, రామలక్ష్మి పరస్పరం ఇష్టపడి ఆ రోజుల్లో అంటే 1954ఏప్రిల్30న రిజిస్టర్డ్ మేరేజీ చేసుకున్నారు. ఈ పెళ్లికి దర్శకుడు హెచ్.ఎం.రెడ్డి, శ్రీశ్రీ సాక్షి సంతకాలు చేశారు. శ్రీశ్రీ తన పెళ్లికి సాక్షి సంతకం చేయాలని ఆరుద్ర భావించడం వల్ల ఇది జరిగింది. శ్రీశ్రీ రామలక్ష్మిని 'అత్తగారు' అని సరదాగా పిలిచేవారు. అయితే శ్రీశ్రీ ధోరణిని రామలక్ష్మి చివరి వరకూ వ్యతిరేకిస్తూనే వచ్చారు.

### ఆరుద్రకు అండా దండా

ఆరుద్ర సినిమా రంగంలో కృషి చేయడానికి, 'సమగ్రాంధ్ర చరిత్ర' పరిశోధన పూర్తి చేయడానికి రామలక్ష్మి అందించిన అండదండలే కారణం.

వీరికి ఐదుగురు కుమార్తెలు విజయ, త్రివేణి, కవిత, లలిత, వాసంతి. వీరి పెంపకం, చదువు బాధ్యతలకోసం ఆరుద్ర సమయాన్ని తీసుకోకుండా ఆమే తన సమయమంతా వెచ్చించారు. 'ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం కోసం విపరీతంగా సమయం ఇవ్వాలనుకునేవాడు. కాని ఇల్లు గడవాలి కదా. సినిమా రంగంలో పని చేస్తేనే డబ్బులు వస్తాయి. అందుకని నేనేమి అనకుండా గబగబా కొన్ని పాటలు రాసేసి ఆ డబ్బు అప్పజెప్పి మళ్లీ పరిశోధనలో పడేవాడు' అన్నారు రామలక్ష్మి. ఆరుద్రకు అనారోగ్యం వస్తే నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డితో మాట్లాడి ప్రభుత్వ సహాయం అందేలా చూశారామె. 'నేను మరణించినప్పుడు ఎటువంటి హంగామా చేయవద్దు' అని ఆరుద్ర కోరడం వల్ల 1998లో ఆరుద్ర మరణించినప్పుడు కేవలం ముగ్గురు నలుగురు స్నేహితులతో కలిసి అంత్యక్రియలు నిర్వహించి ఆ తర్వాతే మరణవార్తను లోకానికి తెలియచేశారు. ఇది సాహిత్య ప్రియులను బాధించినా రామలక్ష్మి ధోరణి అలాగే ఉండేది.

### సినిమా రచయిత్రి

కె.రామలక్ష్మికి సినిమా రంగంలో అందరూ సుపరిచితులు స్నేహితులు. వారిలో భానుమతి రామకృష్ణ, జయలలిత, వాణిశ్రీ తదితరులు ఉన్నారు. కె.విశ్వనాథ్ తీసిన 'జీవనజ్యోతి' సినిమాకు రామలక్ష్మి కథను అందించారు. ఈ సినిమా నిజానికి వాణిశ్రీ కోసమే రాశారు. కె.రామలక్ష్మి రాశారని వాణిశ్రీ నటించారు. దీని నిర్మాణ సమయంలో విశ్వనాథ్‌కు, రామలక్ష్మికి వాదోపవాదాలు నడిచాయి. దాంతో కె.విశ్వనాథ్ విజయవాడలో జరిగిన శతదినోత్సవంలో 'ఇకపై ఇతరులు రాసిన కథలతో నేను సినిమాలు తీయను' అని ప్రకటించారు. రామలక్ష్మి రాసిన మరో సినిమా 'గోరింటాకు'. అయితే దీని మీద ఆ రోజుల్లో వివాదం చెలరేగింది. దాసరి నారాయణరావు స్టోరీ డిపార్ట్‌మెంట్‌లో తెర వెనుక ఉండి పని చేసిన వారిలో రామలక్ష్మి కూడా ఒకరు. ఆమె 1970లలో సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా పని చేశారు.

### స్త్రీ పక్షపాతి

రామలక్ష్మి నిత్య జీవితంలోనే కాదు రచనా జీవితంలోనూ ఆధునికురాలు. ఛాందసాలు లేని జీవనం గడపాలని, భార్యాభర్తలు స్నేహమయ జీవనాన్ని అనుభవించాలని, స్త్రీలకు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ ఉండాలని ఆ రోజుల్లోనే తన కథలలో చెప్పారామె. 1954లో ఆమె తన తొలి కథా సంపుటి 'విడదీసే రైలుబళ్లు' వెలువరించారు. ఈ సంపుటిలోని 'చీలిన దారులు' అనే కథలో ఒక జంట పెళ్లి చేసుకోకుండా సహజీవనం ప్రారంభిస్తారు. పెళ్లి ప్రేమను చంపేస్తుంది అని ఆ కథలో రాసి అప్పటికి తెలియని సహజీవనాన్ని ప్రతిపాదించారామె. 'తొణికిన స్వప్నం', 'ఒక జీవికి స్వేచ్ఛ', 'అద్దం' తదితరాలు ఆమె ఇతర కథా సంపుటాలు. భార్యాభర్తలు స్నేహితులుగా ఉండాలని సూచిస్తూ 1970లలో ఆమె రాసిన 'పార్వతి కృష్ణమూర్తి కథలు' పాఠకాదరణ పొందాయి. ఇందులో భార్య అరమరికలు లేకుండా భర్తతో తన అభిప్రాయాలను చెబుతుంది. స్నేహాన్ని, గౌరవను ప్రదర్శిస్తుంది. భార్యంటే భర్త చెప్పినట్టుగా పడుండాలనే నాటి ధోరణికి ఈ పాత్ర పూర్తి భిన్నం. రామలక్ష్మి రాసిన కథల్లో 'అదెక్కడ' విశిష్టమైనది. ఆ కథలో ముఖ్య పాత్ర తన పేరు మర్చిపోతుంది. దాని కారణం భర్త, పిల్లలు అందరూ 'అది' అని పిలుస్తూ ఉండటమే. చివరకు ఆమె ఒకరోజు ఇంట్లో నుంచి వెళ్లిపోతుంది. భర్త 'అదెక్కడ' అని ఎందరిని అడిగినా కనిపించదు. పురుషుడు మోసం చేస్తే స్త్రీ సింగిల్ మదర్‌గా జీవించగలదనే సందేశం ఇస్తూ కథలు రాశారు. బేలగా ఉండే స్త్రీలను అలాంటి పాత్రలను రామలక్ష్మి హర్షించలేదు. స్త్రీలు ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా తమ జీవితాన్ని మలుచుకోవాలని కోరుతారు.

ఆమె రచనలను ఈ తరానికి మళ్లీ చేరువ చేయాల్సి ఉంది.

కళ





● విజేత కుమార్

# ఫుట్‌బాల్ చెప్పిన కథ

**మార్పు అనేది సామాజిక ఉద్యమాలతోనే కాదు...సరదాగా మొదలయ్యే ఆటలతో కూడా సాధ్యపడుతుందని నిరూపించింది రాజస్థాన్‌కు చెందిన మహిళా జన్ అధికార్ సమితి. ఫుట్‌బాల్ ఆటతో అమ్మాయిల ఆలోచన ధోరణిలో వచ్చిన మార్పు, చైతన్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది కికింగ్ బాల్స్...**

రాజస్థాన్‌లో అనేక ప్రాంతాల్లో బాల్యవివాహాలు సర్వసాధారణం. దీన్ని దృష్టిలో పెట్టుకొని బాల్యవివాహాలకు అడ్డకట్టవేయడానికి మహిళా జన్ అధికార్ సమితి అమ్మాయిల కోసం ఊళ్లలో 'ఫుట్‌బాల్ క్లబ్'లను ఏర్పాటు చేసింది.

బాల్యవివాహాల నిరోధానికి, ఫుట్‌బాల్ ఆటకు సంబంధం ఏమిటి? అనే సందేహం సహజంగానే వస్తుంది. అయితే ఆ ఫుట్‌బాల్ క్లబ్‌లు ఆట మెలకువలకు మాత్రమే పరిమితం కాకుండా పరివర్తన కేంద్రాలుగా మారడమే కొసమెరుపు.

ఆట ఆడటం కోసం సాయంత్రం ఎంతో మంది అమ్మాయిలు గ్రౌండ్‌కు వస్తారు. ఆట పుణ్యమా అని వారి మధ్య స్నేహం పెరిగింది. ఆట అయిపోయిన తరువాత రకరకాల కబుర్లు చెప్పుకునేవారు. అన్ని విషయాలతో పాటు బాల్యవివాహాల టాపిక్ కూడా వచ్చేది.

అంతమాత్రాన పెద్దలను వ్యతిరేకించగలరా? తరాల సంప్రదాయాన్ని కాదనగలరా?

'అవును....అనగలరు' అని ఎందరో అమ్మాయిలు నిరూపించారు. 'చదువు తరువాతే పెళ్లి' అని తల్లిదండ్రులతో గట్టిగా చెప్పారు.

**కట్ చేస్తే...**

ముంబైలో ఉంటున్న విజేత కుమార్ బ్రాండెడ్ కంటెంట్, మ్యూజిక్ వీడియోలు రూపొందించడంలో మంచి పేరు తెచ్చుకుంది. తన తొలి షార్ట్ ఫిల్మ్ 'బ్లౌజ్' న్యూయార్క్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'బెస్ట్ షార్ట్ ఫిల్మ్' అవార్డ్ అందుకుంది.

కొంత కాలం క్రితం విజేత తన స్వస్థలం రాజస్థాన్‌లోని అజ్మీర్‌కు వెళ్లింది. ఒక సాయంత్రం పూట బాల్య జ్ఞాపకాలను పలకరించడానికి తాను చదువుకున్న స్కూలుకు వెళ్లింది. అక్కడ ఆడపిల్లలు చాలా సీరియస్‌గా ఫుట్‌బాల్ ఆడుతుంటే అబ్బురపడింది.

ఆసక్తిగా ఆ అమ్మాయిలను పలకరించింది విజేత.

'స్కూల్ పూర్తయిన తరువాత ఇంటికి వెళితే ఇక బయట అడుగుపెట్టడం అంటూ ఉండేది కాదు. అలాంటిది ఫుట్‌బాల్ ఆట వల్ల రోజూ సాయంత్రం గ్రౌండ్‌కు రాగలుగుతున్నాను' అని తనకు లభించిన స్వేచ్ఛ గురించి చెప్పింది ఒక అమ్మాయి.

ఫుట్‌బాల్ ఆట వల్ల తమలో పెరిగిన

**'వావ్' అనుకోవడమే కాదు డాక్యుమెంటరీ తీయాలని కూడా అనుకుంది విజేత. అనేకానేక సందేహాలతో తొలుత వారు కెమెరా ముందుకు రావడానికి నిరాకరించారు. అయితే విజేతకు వారితో స్నేహం పెరిగాక, తన మీద నమ్మకం ఏర్పడిన తరువాత 'కికింగ్ బాల్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది.**

ఆత్మవిశ్వాసం, నలుగురితో కలిస్తే వచ్చే ధైర్యం, బాల్యవివాహాలపై వ్యతిరేకత గురించి మరో అమ్మాయి వివరంగా చెప్పింది. ఇలా అందరూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

'వావ్' అనుకోవడమే కాదు డాక్యుమెంటరీ తీయాలని కూడా అనుకుంది విజేత. అనేకానేక సందేహాలతో తొలుత వారు కెమెరా ముందుకు రావడానికి నిరాకరించారు. అయితే విజేతకు వారితో స్నేహం పెరిగాక, తన మీద నమ్మకం ఏర్పడిన తరువాత 'కికింగ్ బాల్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది.

పిల్లలతో కలిసి ఈ డాక్యుమెంటరీని చూసింది విజేత. 'కికింగ్ బాల్స్' పిల్లలకు నచ్చింది. ఆ తరువాత ప్రపంచ ప్రేక్షకులకు కూడా నచ్చింది.

బ్యూటిప్స్

# ఏమి చేయకూడదంటే...

**అందానికి చిట్కాలు పాటించడానికి ముందు ఏమేం చేయకూడదో తెలుసుకుంటే మంచిదేమో! ఇవన్నీ తెలిసినవే, అయినా ముఖ్యంగా నిర్లక్ష్యం చేసేదిక్కడే.**



● మొటిమలను గిల్లితే, మచ్చలు పడతాయి. వీటిని పోగొట్టుకోవడానికి చాలా కష్టపడాలి. గిల్లినప్పుడు మొటిమల నుండి వెలువడిన స్రావం ముఖం మీద ఎక్కడ తగిలితే అక్కడ కూడా మొటిమలు వస్తాయి. ● ఫంక్షన్‌కు వెళ్లే ముందు మేకప్ వేసుకుంటాం, కానీ తిరిగి వచ్చాక తుడిచేయడానికి బద్ధకించి అలాగే నిద్ర పోతాం. కొబ్బరినూనెతో తుడుచుకునేంత ఓపిక లేకపోతే కనీసం గోరువెచ్చని నీటిలో కాటన్ ముంచి అయినా మేకప్ క్లీన్ చేయాలి. ● మేకప్ సామగ్రిని ప్రతి ఆరునెలలకొకసారి అప్‌డేట్ చేసుకోవాలి. ఎక్స్‌పైరీ డేట్ చెక్ చేసుకుని, వాటిని కిట్ నుండి తొలగించాలి. ● మేకప్‌లో ఫౌండేషన్ ఇంపార్టెంట్. దీన్ని జాగ్రత్తగా వేసుకోవాలి. స్కిన్ కలర్‌కు సూటయ్యే షేడ్ వాడాలి. అవసరమైన మేరకే వాడాలి. ● హెయిర్ కండిషనర్ వాడేటప్పుడు చిన్న జాగ్రత్త కావాలి. జుట్టు కుదుళ్లకు తగలకుండా అప్లై చేయాలి. జుట్టు పొడిబారినప్పుడు మాత్రమే కండిషనర్ వాడాలి.

ఇంటిప్స్

# సహజమైన రూమ్ ఫ్రెష్‌నర్

● అరకప్పు టేబుల్ సాల్ట్ తీసుకుని, అందులో గులాబీ రేకులను వేయాలి. వీటితోపాటు ఒక స్పూన్ లవెండర్ ఆయిల్ లేదా ఆల్మండ్ ఆయిల్ వేయాలి. అంతే! గది సువాసనలతో నిండిపోతుంది.

● దీన్ని మరింత సులువుగా చేయాలంటే వొలిచిన నారింజ లేదా కమలా పండు మీద టేబుల్ స్పూన్ సాల్ట్‌ను చల్లి ఒక మూలన పెడితే సరి!

● సింక్ మెరవడానికి: ఖరీదైన క్లెన్సర్ జోలికి పోకుండా సింక్ పరిశుభ్రంగా... కొత్త దానిలా కనిపించాలంటే... నిమ్మరసంలో కొద్దిగా టేబుల్ సాల్ట్ వేసి సింక్‌ను తుడిస్తే చాలు... చూస్తుండగానే సింక్ కొత్తదానిలా మెరుస్తుంది.



● పచ్చదనాల పొదరిల్లు

# మొక్కలో మొక్కనై!

**మందారాలు 16 రంగులున్నాయి.**
**జామ చెట్లు ఏడురకాలున్నాయి.**
**అరటి పండ్ల చెట్లు ఐదు రకాలు.**
**వేప, సీమచింత, కానుగ...**
**మర్రి, రావి, జువ్వి, కొబ్బరి...**
**కుండీల్లో ఒదిగిపోయాయి.**
**రణపాల, కొండపిండి...**
**ఇన్సులిన్ ప్లాంట్, కప్పురిల్ల...**
**ఔషధమొక్కల లిస్ట్ ఇది.**
**ఇవన్నీ ఉన్నది నర్సరీలో కాదు.**
**మొక్కల్ని పిల్లల్లా పెంచే మంజుల ఇంట్లో.**
**మనం తినే పంటలు పండించుకుంటున్నాం.**
**పీల్చే గాలిని కూడా 'పెంచుకుందాం' అంటోందామె.**

''ఆమెకు గ్రీన్ ఇండియా చాలెంజ్ విసిరిన వాళ్లు లేరు. తనకు తానుగా తీసుకున్న చాలెంజ్ కూడా కాదు. ఆమె మనసు కోరుకున్న ముచ్చట. పచ్చదనంతో ఆమె పాతికేళ్ల ప్రస్థానానికి ప్రతిరూపం ఈ ఇల్లు. ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లా, గంగపట్నం గ్రామంలో 65 అంకణాల స్థలంలో ఉన్న ఈ ఇంటి పేరు 'జీఆర్‌కే గార్డెన్'. గేటు ముందు నిలబడి చూస్తే ఇల్లు కనిపించదు. అల్లిబిల్లిగా అల్లుకున్నట్లున్న చెట్లు, తీగలను తొలగించి చూస్తే తప్ప గోడలు కనిపించవు. ఎన్ని మొక్కలున్నాయి? ఎన్ని రకాలున్నాయి? అని లెక్కపెట్టాలంటే సాధ్యమయ్యేటట్లు కనిపించలేదు. ఆ వివరాలన్నీ ఈ మొక్కల తల్లి మంజుల చెప్పాల్సిందే.

### సేకరణ చిన్న పని కాదు!

''నేను ఐసీడీఎస్‌లో ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్‌ని. ఉద్యోగంలో పిల్లల్ని చూసుకోవడం, ఇంట్లో మొక్కల్ని పెంచుకోవడమే నా లైఫ్. పండ్ల మొక్కలు దేశీవిదేశీ అన్నీ కలిపి వందకు పైగా ఉన్నాయి. తీగజాతితో కలిపి పూల మొక్కలు వందల్లో ఉన్నాయి. బాటిల్స్, కుండీలు, డ్రమ్ములు మూడు వేలకు పైగా ఉన్నాయి. నా దగ్గర పేపర్ వైన్ మొక్క కూడా ఉంది. యూ ట్యూబ్‌లో మ్యాడ్ గార్డెనర్ మాధవి గారి గార్డెన్ నుంచి తీగజాతులు తెప్పించుకున్నాను. హైదరాబాద్ నర్సరీ మేళాల నుంచి సేకరించాను. బెంగళూరు నుంచి కూడా తెచ్చుకున్నాను. మొక్కలు ఎన్ని కొంటున్నానో లెక్క చూసుకోకుండా కొనేస్తాను. కానీ బస్సు వాళ్లను రిక్వెస్ట్ చేసి వాటిని ఇంటికి తెచ్చుకోవడం చాలా కష్టమయ్యేది. స్వయంగా వెళ్లడం కుదరని నర్సరీలకు ఫోన్ చేసి వీడియో కాల్‌లో అక్కడ ఉన్న మొక్కలను చూసి నా దగ్గర లేనివేవో చెప్పి తెప్పించుకుంటున్నాను. యాలకులు, మిరియాలు, దాల్చిన చెక్క, జాపత్రి వంటి సుగంధ ద్రవ్యాల మొక్కలన్నీ ఉన్నాయి, కానీ లవంగాల తీగ మాత్రం దొరకలేదు.

### ఎనిమిదిళ్లు మారాను!

మొక్కల కోసం మార్కెట్‌లో దొరికే కుండీలు చాలవని పెద్ద పెద్ద సిమెంట్ కుండీలు కూడా నేనే స్వయంగా చేసుకున్నాను. ఇల్లు మారిన ప్రతిసారీ ఈ కుండీలను తీసుకెళ్లడం ఎంత కష్టమయ్యేదో. అలా ఎనిమిదిళ్లు తిప్పాను. నా కష్టం చూసి మా నాన్న ఈ ఇల్లు అమ్మకానికి వచ్చిన సంగతి తెలిసి వెంటనే కొన్నారు. అప్పుడు కూడా 'నీకు ఇల్లు' అని చెప్పలేదు. 'నువ్వు మొక్కలు పెంచుకోవడానికి ఇల్లు' అని చెప్పారు. నాన్న గుర్తుగా నాటిన మామిడి చెట్టు చూడండి ఎంత ఎదిగిందో చూడండి.

**– గుడి మంజుల,** మొక్కల ప్రేమికురాలు



### సీతాఫల కుటుంబం

సీతాఫలం మనకు బాగా తెలుసు. నా దగ్గర రామాఫలం, లక్ష్మణఫలం, హనుమఫలం కూడా ఉన్నాయి. కుండీల్లో కాసే పనస నుంచి యాపిల్ మూడు రకాలు, కివీ, అవొకాడో కూడా పెంచుతున్నాను. ఓ సారి ఎవరితోనో మాట్లాడుతూ 'మా పాప కంటే ముందు మొక్కలనే చూసుకుంటాన'ని చెప్పాను. ఆ మాటను గుర్తు చేసి మరీ దెప్పుతుంటుంది మా అమ్మాయి. తానిప్పుడు హైదరాబాద్‌లో చదువుకుంటోంది. మా వారు కృష్ణపట్నం పోర్టులో ట్రాన్స్‌పోర్ట్ సూపర్‌వైజర్. ఆయనకు ఇంటి నిండా మొక్కలున్నాయని మాత్రమే తెలుసు. మొక్కల పేర్లు కూడా తెలియదు. ఆయన మొక్కల సరదా అంతా సెల్ఫీలు తీసుకుని వాట్సాప్ డీపీలు పెట్టుకోవడం వరకే. మొక్కల పని అంతా నేను, మా అమ్మ చూసుకుంటాం. ఉదయం రెండు గంటల సేపు నేను టెర్రస్ మీద పని చేస్తాను. నేను, మా వారు డ్యూటీలకు వెళ్లిన తర్వాత మా అమ్మ మూడు గంటల సేపు కింద ఉన్న మొక్కల పని చూసుకుంటుంది. సాయంత్రం వచ్చిన తర్వాత కూడా నాకు గంట– రెండు గంటల సేపు ఎరువు కలపడం వంటి ఏదో ఒక పని ఉంటుంది.

### చెట్లమ్మ

మా ఇంటి ఇరుగుపొరుగు వాళ్లు 'టెర్రస్ మీద ఇంత బరువు పెడుతున్నావు. ఇల్లు జాగ్రత్త' అంటూ ఉంటారు. ఇల్లు పాడయితే మరో చిన్న ఇల్లు కట్టుకుంటాను. మొక్కలు పోతే మళ్లీ మొక్కలు పెరగాలంటే ఎన్నో ఏళ్లు పడుతుందని చెబుతాను. నీ చుట్టుపక్కల ఉండడం మాకూ మేలే. మేము పెంచకపోయినా నువ్వు పెంచిన మొక్కల గాలిని పీల్చుకుంటున్నాం అని నవ్వుతారు. మా చెల్లి కొడుకైతే నన్ను చెట్లమ్మ అనే పిలుస్తాడు. ప్రతి ఇల్లూ మొక్కల్ని పెంచితే గాలి ఎందుకు కలుషితమవుతుంది? దారికి అడ్డు వస్తోందని, మరేదో పనులకు ఇబ్బందవుతోందని... ఎన్నో ఏళ్లు పెరిగిన చెట్టుని నిలువునా నరికేస్తుంటారు. పెరిగిన చెట్టుని నరకడం కాదు, ఒక చెట్టుని పెంచి చూడండి అని గొంతెత్తి అరవాలనిపిస్తుంటుంది'' అని మొక్కల మీద తన ప్రేమను వ్యక్తం చేశారు గుడి మంజుల.

– వాకా మంజులారెడ్డి